సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



సమాజ సంఘటితం కోసమే..
సమాజ సంఘటితం కోసమే బలిరాం హెడ్గె వార్ ఆర్‌ఆర్‌ఎస్‌ను స్థాపించారని కమలానంద భారతిస్వామి అన్నారు.
- 8లో ▸



విలీన కష్టాలు
వైద్యారోగ్య శాఖలోని సామాజిక ఆస్పత్రులను వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసినా సౌకర్యాలు ఇంకా మెరుగవలేదు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /20.3

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చలిగాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

మరి కొద్ది గంటల్లో..



నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన నిజామాబాద్ అర్బన్ కౌంటింగ్ హాల్

నేడే ఓట్ల లెక్కింపు

- కౌంటింగ్‌కు పాలిటెక్నిక్ కళాశాలలో పకడ్బందీ ఏర్పాట్లు
- మొదట పోస్టల్ బ్యాలెట్.. ఆ తర్వాత ఈవీఎం ఓట్ల కౌంటింగ్
- ఆర్మూర్‌కు 16 రౌండ్లు.. నిజామాబాద్ రూరల్, అర్బన్‌లో 21 రౌండ్లు



రౌండ్ల వారీగా లెక్కింపు

నియోజకవర్గం	రౌండ్లు	నియోజకవర్గం	రౌండ్లు
ఆర్మూర్	16	బాన్సువాడ	19
బోధన్	18	నిజామాబాద్ అర్బన్	21
బాల్కొండ	18	నిజామాబాద్ రూరల్	21

సుభాష్‌నగర్ : శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ మొదలు కానుంది. ఆలోపే అభ్యర్థులు, ఏజెంట్లు కేంద్రానికి చేరుకోనున్నారు. కౌంటింగ్ కోసం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించిన తర్వాతే.. ఈవీఎంల ఓట్లను లెక్కించనున్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. అత్యల్పంగా ఆర్మూర్‌కు 16 రౌండ్లు కాగా, అత్యధికంగా నిజామాబాద్ రూరల్, అర్బన్ 21 రౌండ్లలో ఫలితం తేలనుంది. కౌంటింగ్ సాఫీగా సాగేందుకు అవసరమైన అన్నిరకాల చర్యలను ఎన్నికల అధికారులు చేపట్టారు. లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ కల్మేశ్వర్ ఇప్పటికే ప్రకటించారు.

జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాలకు 30వ తేదీన ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. 77 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాల్లో 13,94,986 మంది ఓటర్లకు గాను 10,40,865(74.68 శాతం) మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో 7,863 మంది ఓట్లు వేశారు. ఈ సారి నూతనంగా ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 12 డీ (80 ఏళ్లపైబడిన వారు, దివ్యాంగులు, అత్యవసర సర్వీసులు) ద్వారా ఇంటి వద్దనే 2,298 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, గదులకు సీల్ వేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు ఆరు సెగ్మెంట్లకు సంబంధించి మొత్తం 122 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 131 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 123 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ప్రతి నియోజకవర్గానికి 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటుచేశారు. పరిశీలకుల ఆమోదం తర్వాత ఫలితాలను ప్రకటిస్తారు.

కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో భాగంగా శనివారం కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఆరు సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించారు. వారికి ఇప్పటికే మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించామని కలెక్టర్ పరిశీలకుల దృష్టికి తెచ్చారు. రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారన్నారు. కాగా మూడో విడత కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆదివారం ఉదయం 5 గంటలకు రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని ఆయా టేబుళ్లకు కేటాయిస్తారని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, సీపీవో బాబురావు, ఎన్‌ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.


కౌంటింగ్ హాల్‌లో టేబుళ్లు, కుర్చీలు

తేలనున్న భవితవ్యం

- ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూపులు


ఉమ్మడి జిల్లాలో బరిలో ఉన్న ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికల క్రతువులో కీలకమైన కౌంటింగ్ ఘట్టం నేడు ముగియనుంది. అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. పోలింగ్ ముగిసినప్పటి నుంచి నిమిషాలు, గంటలు లెక్కబెట్టుకుంటూ అభ్యర్థులు, ఆయా పార్టీల కార్యకర్తలు లెక్కింపు కోసం ఎదురు చూస్తుండగా, సాధారణ ప్రజల్లో సైతం ఉత్కంఠ నెలకొంది. నిజామాబాద్ నగరంలో బాల్కొండ, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేయనున్నారు. కామారెడ్డిలో ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు మధ్యలో రెండు రోజులు మాత్రమే ఉన్నప్పటికీ గంటలవారీగా లెక్కపెట్టుకుంటూ అన్ని వర్గాల వాళ్లు ఎదురు చూస్తుండటం గమనార్హం.

త్రిముఖ పోటీ నేపథ్యంలో..
నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మూడు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఫలితాలపై మరింతగా ఉత్కంఠ ఉంది. అభ్యర్థులతో పాటు కార్యకర్తలు, కీలక నాయకులు నరాలు తెగే టెన్షన్‌తో ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. అర్ధరాత్రి వరకు నిద్రపోకుండా కూడికలు, తీసివేతలతో ఎవరి విశ్లేషణలు వారు చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫలితాల విషయంలో ఆసక్తి చూపుతూనే తమ నియోజకవర్గ ఫలితాలపై లెక్కలు వేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రధాన పార్టీల నాయకులకు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నాయకుల ఫోన్ల తాకిడి ఎక్కువగా ఉంటోంది. త్రిముఖ పోరు ఉండడంతో ఇక్కడి ఫలితాల విషయమై ఇతర జిల్లాలకు చెందిన నాయకులతో పాటు సాధారణ ప్రజలు సైతం ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బోధన్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, బాల్కొండలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్‌లో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్‌లో మాజీ మంత్రి షబ్బీర్ అలీ బరిలో ఉండడంతో పాటు త్రిముఖ పోరు నేపథ్యంలో ఫలితాలపై ఆసక్తి నెలకొంది.

కౌంటింగ్‌కు భారీ బందోబస్తు

- 400 మంది పోలీసులతో పహారా
- సెంటర్ వద్ద 144 సెక్షన్

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు కోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను కాలేజీలో భద్రపరిచారు. ఈవీఎంలకు పోలీసులు మూడు అంచెల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం కౌంటింగ్ సందర్భంగా 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. బందోబస్తులో 10 మంది ఏసీపీలు, 20 మంది సీఐలు, 60 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు 310 మంది పాల్గొంటారని వివరించారు. పాలిటెక్నిక్ కాలేజీతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆదివారం 144 సెక్షన్‌లో అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు గుంపులుగా ఉండొద్దని సూచించారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించాలని కోరారు.

వాహనాల పార్కింగ్
కౌంటింగ్ కోసం వచ్చే అధికారులు, ఏజెంట్ల కోసం పార్కింగ్ ప్రదేశాలను అధికారులు ఏర్పాటు చేశారు. బోధన్ రోడ్డు, గాంధీచౌక్, పాత కలెక్టరేట్, వినాయకనగర్, మోపాల్ మండలం నుంచి వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది తమ వాహనాలను సీఎస్‌ఐ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలి. బాల్కొండ, ఆర్మూర్, బోధన్ (బైపాస్), హైదరాబాద్ (బైపాస్) నుంచి వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది తమ వాహనాలను చంద్రశేఖర్ కాలనీ వద్ద గల కల్లు దుకాణం ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

రోడ్ల మూసివేత
కౌంటింగ్ నేపథ్యంలో నగరంలో పలు రోడ్లను మూసి వేసినట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. నగరంలోని జిల్లా పరిషత్‌కు వెళ్లే రోడ్డు, కంఠేశ్వర్ రోడ్డు, మహిళా కాలేజీ రోడ్డు మార్గాలను మూసి వేశారు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ మార్గంలో గల రైల్వే అండర్ బ్రిడ్జి, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఆర్మూర్ వైపు వెళ్లే కంఠేశ్వర్ దేవాలయం వరకు రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు. రామాలయం రోడ్డు, జన్మభూమి రోడ్డు మూసివేసినట్లు వివరించారు.


పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ బందోబస్తులో పాల్గొననున్న పోలీసులు


పాలిటెక్నిక్ కళాశాల ఎదుట పోలీసుల బందోబస్తు


కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే దారిలో బారికేడ్లు

ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మలేం..

- మూడోసారీ అధికారం మాదే
- బాన్సువాడలో బీఆర్‌ఎస్‌కే భారీ మెజార్టీ
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : రెండు రోజులుగా వెల్లడిస్తున్న ఎగ్జిట్ పోల్స్‌లో ఎలాంటి ఖచ్చితత్వం లేదని, ఎగ్జిట్‌పోల్స్‌ను తలదన్నేలా రాష్ట్రంలో మూడోసారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 70–75 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించనున్నారన్నారు. కేసీఆర్ పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. చాలా చోట్ల ప్రతిపక్షాలు మద్యం, డబ్బులు పంపిణీ చేసినప్పటికీ ప్రజలు బీఆర్‌ఎస్‌కే ఓటేశారన్నారు. కాంగ్రెస్ వ్యవహారం చేస్తుంటే పిల్ల పుట్టకముందే కుల్ల కుట్టినట్లుందన్నారు. ఎన్నికల పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, గంగాధర్, కృష్ణరెడ్డి, ఎజాస్, జుబేర్, దాసరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


బాన్సువాడలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

పొరపాట్లకు ఆస్కారం ఉండొద్దు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సీపీతో కలిసి కౌంటింగ్ సెంటర్ల పరిశీలన

సుభాష్‌నగర్ : ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కలెక్టర్ శనివారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి కౌంటింగ్ సెంటర్లు పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లల్లో టేబుళ్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు కలెక్టర్ తన చాంబర్‌లో ఆరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 5 గంటలకు పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ చేయించాలని ఆర్‌వోలకు మార్గనిర్దేశం చేశారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలు తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియ యథాతథంగా కొనసాగించాలన్నారు. పాసులు ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్‌లోనికి అనుమతించాలని సూచించారు. సిబ్బందికి అల్పాహారం, భోజనాల కోసం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలను సీల్ చేసి జిల్లా కేంద్రంలోని గోడౌన్‌కు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాల సంస్థ కమిషనర్ ఎం మకరందు, అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజా ఉన్నారు.


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

యాసంగికి రంది లేనట్లే!

- ఎస్సారెస్పీలో 79 టీఎంసీల నీరు
- ఖరారు కాని నీటి విడుదల ప్రణాళిక

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ప్రస్తుతం నీటితో కళకళలాడుతుండటంతో యాసంగికి రందీ లేనట్లే. ప్రాజెక్టులో ప్రస్తుతం 79 టీఎంసీల నీరు ఉంది. ఈ నీటితో ఆయకట్టుకు యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేపట్టవచ్చని ప్రాజెక్ట్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. అయితే ఉన్నతాధికారులు నీటి విడుదలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఎలాంటి ప్రణాళిక సిద్ధం కాలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి విడుదలపై ప్రణాళిక చేయాలని కోరుతున్నారు.

గతేడాది కంటే తక్కువ నీరు
ప్రాజెక్ట్‌లో ఈ ఏడాది యాసంగి సీజన్ ప్రారంభం నాటికి గతేడాది కంటే తక్కువ నీరు ఉంది. గతేడాది ప్రాజెక్ట్‌లో ఈ సమయానికి 87 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం 79 టీఎంసీలు ఉంది. దీంతో ఈ ఏడాది జనవరి 1 నుంచి నీటి విడుదల చేపట్టే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది డిసెంబర్ 18 నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు
శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. నారు మడుల కోసం నేలను సిద్ధం చేస్తున్నారు. నారు పోయడానికి కాలువల ద్వారా కొంత మేరా నీటి విడుదల చేపడితే ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు. కాకతీయ కాలువ నీటి ఆధారంగా పంపు సెట్లు బిగించుకున్న రైతులకు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ ఉప కాలువల కింద భూములు ఉన్న రైతులకు నారుమడులకు నీరు అందడం లేదు. ప్రస్తుతం సాగు ఆలస్యమైతే పంట చివరి దశలో ఎండలు తీవ్రంగా ఉంటాయని, నీరు అందకుండా పోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మాదిరిగానే డిసెంబర్ మధ్య నుంచే నీటి విడుదల చేపట్టాలని కోరుతున్నారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

ప్రతిపాదనలు పంపించాం
శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటలకు నీటి విడుదల కోసం ప్రతిపాదనలు పంపించాం. శివమ్ కమిటీలో చర్చించాక నిర్ణయం ప్రకటిస్తారు. యాసంగిలో నీటి విడుదలకు ఎలాంటి ఢోకా లేదు. – చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

న్యూస్‌రీల్

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



ఆర్మూర్‌టౌన్ : విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా అన్నారు. ఆర్మూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. పాఠాలను చక్కగా నేర్చుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఎంఈవో రాజగంగారాం, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, వసంత్, రాజేశ్వర్, గంగాధర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పోలీస్, ఎక్సైజ్, అటవీ అధికారులకు శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కోర్టులో జరిగిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ సాక్షుల వాంగ్మూలం సేకరించే విధానం, నేర విచారణలో జరిగే లోపాలను గురించి వివరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసార పు రాజేష్‌గౌడ్, ఎండీ రహీమోద్దీన్, రవిరాజ్, రాజారెడ్డి, వసంత్ తదితరులు ఉన్నారు.

బోధన్‌లో..



బోధన్ : పోలీస్ అధికారులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్ వివిధ కోర్టుల అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి శ్యాంరావు, సమ్మయ్య, చిదురాలరాణి సూచించారు. శనివారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో డివిజన్ పరిధిలోని ఎస్సైలకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. నేర విచారణ ప్రక్రియలో పోలీస్ అధికారుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సైలు కృష్ణకుమార్, నాగ్‌నాథ్, నీరేష్, ఉదయ్‌కుమార్, సందీప్, ఎక్సైజ్ ఎస్సై బాలయ్య పాల్గొన్నారు.

కాలభైరవ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

- నేడు బద్దిపోచమ్మకు బోనాలు



రామారెడ్డి (ఎల్లారెడ్డి) : ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీ కాలభైరవుడి జన్మదినోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం గణపతి పూజతో మొదలైన జన్మదిన ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు 72 గంటల పాటు నిరంతరంగా కొనసాగే సంపతధారాభిషేకం అర్చకులు వేద మంత్రోచ్చరణ మధ్య ప్రారంభించారు. ఆలయ ఈవో ప్రభుగుప్తా సిబ్బంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీకృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిలో క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 33,347 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

9 నుంచి అంబేడ్కర్‌ ఓపెన్‌ డిగ్రీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: అంబేడ్కర్‌ ఓపెన్‌ డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 9 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్‌ రంజిత శనివారం తెలిపారు. డిగ్రీ ఫస్టియర్‌ విద్యార్థులకు ఈనెల 9 నుంచి 12, సెకండియర్‌ విద్యార్థులకు 16 నుంచి 21, థర్డియర్‌ విద్యార్థులకు 9 నుంచి 14వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయన్నారు. హాల్‌ టికెట్లను ఒక రోజు ముందుగానే డౌన్‌లోడ్‌ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పీజీ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 11వరకు చెల్లించవచ్చని అన్నారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నర్సింగ్‌పల్లి వాసికి డాక్టరేట్‌


డాక్టరేట్‌ సాధించిన హనోక్‌

సిరికొండ: నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన కాయిత హనోక్‌ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ పొందారు. ద ఇన్‌ఫ్లూయెన్స్‌ ఆఫ్‌ సెయింట్‌ అగస్టిన్‌ ఆన్‌ థియోలాజికల్‌ డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ క్రిస్టియానిటీ అనే అంశంపై పరిశోధన చేశారు. శాతవాహన యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ మల్లేశ్‌ పర్యవేక్షణలో పరిశోధన చేపట్టారు. హనోక్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ లింబాద్రి, రాష్ట్ర వైద్యారోగ్య సంక్షేమ శాఖ చైర్మన్‌ మధుశేఖర్‌, రిటైర్డ్‌ ఉపాధ్యాయుడు సాల్మన్‌ అభినందించారు.

డబ్బులు ఇవ్వలేదని ఓటర్ల ఆందోళన



మాచారెడ్డి: స్వచ్ఛందంగా ఓటేయాల్సిన పౌరులను పలు రాజకీయ పార్టీ నేతలు డబ్బులిస్తామని మభ్య పెట్టి చివరికి ఆందోళన చేసే స్థాయికి దిగ జార్చారు. ఓ పార్టీకి ఓటేస్తే డబ్బులు ఇస్తామని చెప్పి ఇవ్వలేదంటూ పలువురు ఓటర్లు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ ఘటన పాల్వంచ మండలం ఇసాయిపేటలో చోటుచేసుకుంది. గ్రామంలోని 23వ బూత్‌ ఓటర్లకు డబ్బులిస్తామని ఆశ జూపి తీరా ఓటేసిన తర్వాత ఆ బూత్‌ ఇన్‌చార్జి రేపు మాపు అంటూ ముఖం చాటేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు.

జాతీయ స్థాయి పోటీలకు నీరజ్‌



కామారెడ్డి అర్బన్‌: జాతీయ స్థాయి సెపక్‌ తక్రా పోటీలకు కామారెడ్డి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థి నీరజ్‌ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సతీశ్‌ శనివారం తెలిపారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సెపక్‌ తక్రా పోటీల్లో కామారెడ్డికి చెందిన నీరజ్‌, భానుతేజ, మనోజ్‌ పాల్గొనగా నీరజ్‌ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులతో పాటు జాతీయ స్థాయికి ఎంపికైన నీరజ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎవరిని వరించెనో..



- కౌంటింగ్‌పై జోరుగా చర్చలు
- అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠ..

ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు తేలనున్నాయి. చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల భవిత్యం తేటతెల్లం కానున్నది. నగరంలోని పాలిటెక్నిక్‌ కళాశాలలో బాన్సువాడ, బాల్కొండ, బోధన్‌, ఆర్మూర్‌, నిజామాబాద్‌ అర్బన్‌, రూరల్‌ నియోజకవర్గానికి చెందిన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోని 10,40,835 మంది ఓటర్లు తమ నిర్ణయాన్ని ఈవీఎంలో భద్రపరిచారు. దీంతో అభ్యర్థులు తమ నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల వారీగా పోలైన ఓట్లపై అనుచర గణంతో చర్చిస్తున్నారు. గెలుపు ఓటములపై కూడికలు, తీసివేతలు వేసుకుంటున్నారు. నేడు ఓట్ల లెక్కింపులో ఏ ఈవీఎంలో ఎవరిని వరిస్తోందనే చర్చ అభ్యర్థులలో ఉత్కంఠ పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గాల్లో నమోదైన ఓట్లు..

బాల్కొండ నియోజకవర్గంలో 2,21,445 ఓట్లు ఉండగా 1,76,526 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ నుంచి ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ నుంచి సునీల్‌రెడ్డి, బీజేపీ నుంచి అన్నపూర్ణమ్మ బరిలో ఉన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 1,95,191 ఓట్లు ఉండగా 1,57,663 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్‌ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌ నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి, బీజేపీ నుంచి యెండల లక్ష్మీనారాయణ బరిలో ఉన్నారు. నిజామాబాద్‌ అర్బన్‌ నియోజకవర్గంలో 2,94,832 ఓట్లు ఉండగా 1,81,808 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్‌ నుంచి బిగాల గణేశ్‌ గుప్తా, బీజేపీ నుంచి ధన్‌పాల్‌ సూర్యనారాయణ, కాంగ్రెస్‌ నుంచి షబ్బీర్‌ అలీ పోటీలో ఉన్నారు.

రూరల్‌ నియోజకవర్గంలో 2,53,233 ఓట్లకు గాను 1,93,556 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్‌ నుంచి భూపతిరెడ్డి, బీజేపీ నుంచి దినేశ్‌ కులాచారి, బీఆర్‌ఎస్‌ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ బరిలో ఉన్నారు. బోధన్‌ నియోజకవర్గంలో 2,20,068 ఓట్లకు గాను 1,71,478 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్‌ నుంచి షకీల్‌ ఆమేర్‌, కాంగ్రెస్‌ నుంచి సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నుంచి వడ్డి మోహన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఆర్మూర్‌ నియోజకవర్గంలో 2,10,217 ఓట్లకు గాను 1,59,804 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ నుంచి పైడి రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్‌ నుంచి వినయ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నుంచి ఆశన్నగారి జీవన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ప్రజలు ఎటువైపు ఉన్నారనేది నేటి ఓట్ల లెక్కింపుతో తేలనుంది.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా..

- బీజేపీ అర్బన్‌ అభ్యర్థి ధన్‌పాల్‌ సూర్యనారాయణ


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ధన్‌పాల్‌

సుభాష్‌నగర్‌: నగరంలోని పేదల సమస్యల పరిష్కారంలో ముందుంటానని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్‌ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని పలు డివిజన్లలో శనివారం పర్యటించారు. తెలంగాణ అమరవీరుల పార్క్‌లో, జీజీ కళాశాల మైదానంలో వాకింగ్‌ చేస్తూ ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన వడగళ్ల వానతో కూలిన ఇళ్లను పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. డబుల్‌ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధాని మోదీ ఆవాస్‌ యోజన కింద ప్రతిఒక్కరికి ఇండ్లు అందజేస్తున్నామని, రాబోయే రోజుల్లో ఇందూరు నగరంలో కూడా పంపిణీ చేస్తామన్నారు. పోలింగ్‌ రోజు బీజేపీ కార్యకర్తలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడిలో కార్యకర్తలు గాయపడ్డారని, పోలీసుల అత్యుత్సాహంతో కొందరు ఓటేయానికి రాలేకపోయారని ఆరోపించారు. అనంతరం కార్యకర్తల నివాసాలకు వెళ్లి పరామర్శించారు. కార్యకర్తలకు ఇబ్బంది వస్తే అండగా ఉంటానన్నారు. ఆయన వెంట నాయకులు గడ్డం రాజు, పుట్ట వీరేందర్‌, నాగోళ్ల లక్ష్మీనారాయణ, గట్ల గంగాధర్‌, మఠం పవన్‌, ఆనంద్‌, పవన్‌, డివిజన్‌ వాసులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ధన్‌పాల్‌ సూర్యనారాయణ

వెల్లివిరిసిన మహిళా చైతన్యం



మోర్తాడ్‌: సాధారణ ఎన్నికల పోలింగ్‌లో మహిళా ఓటర్లు తమ చైతన్యం చాటారు. పురుషుల కంటే తామే ముందు అని పోలింగ్‌ కేంద్రాల్లో బారులు తీరి మరి ఓటేశారు. ఉమ్మడి జిల్లాలోని రెండు నియోజకవర్గాలు మినహా, మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును ఉత్సాహంగా ఉపయోగించుకున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో పురుషులు 73,716, మహిళలు 1,01,991 మంది ఓటు వేయగా అందులో 28,275 మంది మహిళా ఓట్లే ఎక్కువ ఉన్నాయి. ఆర్మూర్‌లో పురుషులు 69,508, మహిళలు 90,296 మంది ఓటు వేయగా అందులో 20,788 మహిళా ఓట్లు ఎక్కువ పోలయ్యాయి. నిజామాబాద్‌ రూరల్‌లో పురుషులు 82,665, మహిళలు 1,10,888 మంది ఓటు వేయగా అందులో 28,223 మహిళా ఓట్లు ఎక్కువ పడ్డాయి. బోధన్‌లో పురుషులు 81,293, మహిళలు 90,183 మంది ఓటు వేయగా అందులో 8,890 మంది మహిళా ఓట్లు ఎక్కువ పోలయ్యాయి. కామారెడ్డిలో పురుషులు 89,396, మహిళలు 1,00,866 మంది ఓటు వేయగా అందులో 11,470 మహిళా ఓట్లు ఎక్కువగా పడ్డాయి. ఎల్లారెడ్డిలో పురుషులు 87,212, మహిళలు 96,202 మంది ఓటు వేయగా అందులో 8,990 మంది మహిళా ఓట్లు ఎక్కువ పోలయ్యాయి. బాన్సువాడలో పురుషులు 76,009, మహిళలు 82,651 మంది ఓట్లు వేయగా 16,642 మహిళా ఓట్లు ఎక్కువ పడ్డాయి. జుక్కల్‌, నిజామాబాద్‌ అర్బన్‌లో ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే ఇక్కడ ఉన్న ఓట్లలో మహిళలు తక్కువగా ఓట్లు వేయడంతో శాతం ప్రకారం పురుషులే ఆధిక్యంలో ఉన్నారు. ఈ రెండు నియోజకవర్గాలలో పురుషులు 62 శాతం, మహిళలు 61 శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పనిచేయని నిఘానేత్రాలు

- నిర్వహణ లేక మరమ్మతులకు నోచుకోని వైనం


రాజంపేట ప్రధాన కూడలిలో పనిచేయని సీసీ కెమెరాలు

రాజంపేట: నేరాల నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తున్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో అలంకార ప్రాయంగా మారుతున్నాయి. నిర్వహణ లేక మరమ్మతులకు నోచుకోకుండా పోతున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలో ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించడంతో గ్రామస్తులు సీసీ కెమెరాలను పలు గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఏర్పాటు ప్రక్రియ బాగానే ఉన్నా నిర్వహణ లేక సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారుతున్నాయి. స్థానిక ప్రజలు, దాతల సహకారంతో రాజంపేట మండల కేంద్రంలో సీసీ కెమెరాలను బిగించారు. ప్రస్తుతం వాటి నిర్వహణ లేక పోవడంతో మరుగున పడ్డాయి. మండల కేంద్రానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణం సాగిస్తుంటారు. దొంగతనాలు, నేరాలను అదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టి వాడుకంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విలీన కష్టాలు..

- ఆసుపత్రుల్లో కొరవడిన సౌకర్యాలు
- ఆర్థిక శాఖ నుంచి లభించని ఆమోదం
- కొత్త పోస్టులను మంజూరు చేసినా భర్తీ చేయని వైనం



మోర్తాడ్‌లోని సామాజిక ఆస్పత్రి భవనం

మోర్తాడ్‌: వైద్యారోగ్య శాఖ పరిధిలో కొనసాగిన సామాజిక ఆస్పత్రులను ప్రభుత్వం వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసినా ఆర్థిక శాఖ ఆమోదం లభించకపోవడంతో సేవలు ఇంకా మెరుగుపడలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో కొనసాగిస్తూ 30 పడకలు, 100 పడకల ఆస్పత్రులను మాత్రం వైద్య విధాన పరిషత్‌లోకి మార్చారు. ఆస్పత్రుల పునర్విభజన వల్ల సేవలు, సౌకర్యాలు మెరుగవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. మోర్తాడ్‌, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, వర్ని, నవీపేట్‌లో 30 పడకల ఆస్పత్రులు ఉన్నాయి. బోధన్‌, ఆర్మూర్‌లో వంద పడకలు, జిల్లా కేంద్రంలో జనరల్‌ ఆస్పత్రి ఉన్న విషయం విధితమే. 30 పడకల ఆస్పత్రిలో వైద్యులు, స్టాఫ్‌ నర్సులు ఇతర వైద్య సిబ్బంది పోస్టులను 32వరకు కేటాయించారు. వంద పడకల ఆస్పత్రిలో అన్ని రకాల పోస్టులను 121వరకు కేటాయించారు. అంటే జిల్లాలో 132 మంది స్పెషలిస్టులైన వైద్యులతో పాటు 181 మంది వివిధ హోదాలలో పని చేసే ఉద్యోగులను నియమించడానికి నోటిఫికేషన్‌ జారీ చేశారు. వైద్యులు, ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసినా ఆస్పత్రులను వైద్య విధాన పరిషత్‌ నిర్వహించడానికి ఆర్థిక శాఖ ఆమోదం తెలుపాల్సి ఉంది. ఆర్థిక శాఖ ఆమోదం తెలిపితేనే ఆస్పత్రుల నిర్వహణ, ఉద్యోగుల జీత భత్యాలకు సంబంధించి నిధులు విడుదలవుతాయి. ఆర్థిక శాఖ ఆమోదం కోసం వైద్య విధాన పరిషత్‌ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించినా ఉలుకుపలుకు లేకుండా ఉంది. ఇదిలా ఉండగా భీమ్‌గల్‌లో వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. ఈ ఆస్పత్రి అందుబాటులో రావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. భీమ్‌గల్‌ ఆస్పత్రికి ఆర్థిక శాఖ ఆమోదం లభించడం విశేషం. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రికి ఆమోదం తెలిపిన ఆర్థిక శాఖ, సొంత భవనాలు ఉన్న ఆస్పత్రులకు మాత్రం ఆమోదం చెప్పకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఆర్థిక శాఖతో పాటు వైద్య ఆరోగ్య శాఖను మంత్రి హరీశ్‌రావు నిర్వహిస్తున్నారు. రెండు శాఖలు ఒకే మంత్రి పరిధిలో ఉండగా ఆస్పత్రుల నిర్వహణకు ఆర్థిక శాఖ ఆమోదం తెలుపకుండా మోకాలడ్డటం ఎందుకో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వైద్య విధాన పరిషత్‌లో విలీనం జరిగిన వైద్య సేవల్లో మార్పులు లేకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసిన ఆస్పత్రులకు ఆర్థిక శాఖ ఆమోదం లభించేలా చర్యలు చేపట్టి సేవలను విస్తరింప చేయాలని పలువురు కోరుతున్నారు.

సమాజ సంఘటితం కోసమే..


భూమిపూజ చేస్తున్న కమలానంద భారతీస్వామి

రెంజల్‌: సమాజ సంఘటితం కోసమే మాన్యవీయ డాక్టర్‌ బలిరాం హెడ్గెవార్‌ ఆర్‌ఎస్‌ఎస్‌ను నిర్మించారని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి పేర్కొన్నారు. హెడ్గెవార్‌ పూర్వీకుల గ్రామమైన రెంజల్‌ మండలం కందకుర్తిలో శనివారం హెడ్గెవార్‌ స్మృతిమందిర నిర్మాణ పనులకు స్వామీజీ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారణ జన్ముడైన డాక్టర్‌జీ ముందస్తు ఆలోచనతో సంఘటన నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. ప్రతీ యుగంలో ఎవరో ఒకరు వచ్చి హిందూ ధర్మాన్ని నెలబెట్టారని తెలిపారు. స్వామీ నారాయణ ట్రస్టు వారు పర దేశంలో సుమారు రూ. 6 వందల కోట్లతో ఆలయం నిర్మిస్తే కూల్చిన సంస్కృతి ముస్లిం దేశాలకు ఉందన్నారు. ఈ నెల 24న శ్రీరాముని జన్మభూమి అయోధ్యలో రామాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. 1925లో స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్‌కు 2025 నాటికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కందకుర్తిలో పలు సేవా కార్యాక్రమాలకు కేశవా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కందకుర్తికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉందన్నారు. రానున్న రోజుల్లో కందకుర్తి పెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా సామాజిక వికాస కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మల్లారం లింగేశ్వరగుట్ట ఆశ్రమ పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్‌, ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రాంత సంఘచాలక్‌ బూర్ల దక్షిణమూర్తి, అంకు మహేశ్‌, పొన్నపల్లి సోమయాజులు, చామకూర సుధాకర్‌రెడ్డి, వెంకట శివకుమార్‌, యెండల లక్ష్మీనారాయణ, దిలీప్‌శాస్త్రీ, మంగళ వేణుగోపాల్‌, సీతారాం త్యాగి మహరాజ్‌, సతీశ్‌, యోగేశ్‌, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం


శిక్షణలో క్రీడాకారులు

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో ఈ నెల 4, 5, 6వ తేదీల్లో నిర్వహించే 70వ సీనియర్‌ బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల శిక్షణ శిబిరం కొనసాగుతోంది. స్థానిక కబడ్డీ క్రీడాకారుడు ఏలేటి సాయారెడ్డి స్మారకార్థం గ్రామంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టోర్నమెంట్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ గంగాధర్‌ కోరారు.

క్రైం కార్నర్‌

కారు బైక్‌ ఢీ: ఒకరు మృతి


సత్తయ్య మృతదేహం

తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్‌ శివారులో కారు, బైక్‌ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. కరీంనగర్‌ జిల్లా అల్మాస్‌పురకు చెందిన సింగర వేణి సత్తయ్య(49) లింగంపేట్‌ మండలంలోని నల్లమడుగులో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎర్రాపహాడ్‌ నుంచి మోతెకు వెళ్తున్న కారు ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కారుడ్రైవర్‌ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..


రాంరెడ్డి (ఫైల్‌)

తాడ్వాయి: మండలంలోని దేమికలాన్‌ గ్రామానికి చెందిన కుంట రాంరెడ్డి(45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. రాంరెడ్డి శుక్రవారం సాయంత్రం కామారెడ్డిలో పనులు ముగించుకొని బైక్‌పై దేమికలాన్‌కు వస్తుండగా తాడ్వాయి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాంరెడ్డిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు ఢీకొని 10 మేకలు మృతి

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణంలోని హనుమాన్‌ టెకిడి రైల్వే గెట్‌ వద్ద శనివారం బోధన్‌ నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ రైలు ఢీకొనడంతో 10 మేకలు మృతి చెందాయి. దీంతో రైలు అరగంట పాటు నిలిచిపోయింది. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదంలో తనకు రూ. లక్ష నష్టం వాటిల్లిందని అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


శ్రీకాంత్‌(ఫైల్‌)

దోమకొండ: ముత్యంపేట గ్రామానికి చెందిన దొండడి శ్రీకాంత్‌ (27) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మురళి శనివారం తెలిపారు. వ్యవసాయం చేసుకునే శ్రీకాంత్‌ ఇటీవల గ్రామంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి పలువురి వద్ద అప్పు చేశాడు. అప్పులు బాగా పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పెర్కిట్‌లో బంగారం చోరీ

ఆర్మూర్‌టౌన్‌: ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి ఆమె వద్ద ఉన్న రెండు తులాల బంగారాన్ని దుండగుడు చోరీ చేసిన ఘటన పెర్కిట్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెర్కిట్‌కు చెందిన రాజుబాయి అనే వృద్ధురాలి వద్దకు దుండగుడు వచ్చి పింఛన్‌ మంజూరైందని ఫొటోలు తీసుకోవాలంటు నమ్మబలికాడు. ఫొటోలో ఒంటిపై ఉన్న బంగారాన్ని తీసివేయాలని చెప్పడంతో రాజుబాయి బంగారాన్ని తీసి ఓ పేపర్‌లో పెట్టింది. ఫొటో తీస్తున్నట్లు నటించి బంగారం ఉన్న ప్యాకెట్‌ను ఎత్తుకెళ్లాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి తెలిపింది.

జీపీ ఎదుట ఆందోళన

భీమ్‌గల్‌: మండలంలోని సంతోష్‌నగర్‌ తండా లో జీపీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో తండా వాసులు శనివారం ఆందోళన చేపట్టారు. కొన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని సర్పంచ్‌, జీపీ అధికారులు, సిబ్బందికి పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదన్నారు.దీంతో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టినట్లు తండావాసులు తెలిపారు.



జీపీ ఎదుట ఆందోళన చేస్తున్న తండవాసులు

బాస్కెట్‌ బాల్‌ టోర్నీకి ఉదయ్‌ కిరణ్‌

నిజామాబాద్‌ నాగారం : ఈనెల 3 నుంచి పది వరకు పంజాబ్‌ లో జరిగే జాతీయస్థాయి సీనియర్‌ బాస్కెట్బాల్‌ టోర్నీ కి జిల్లాకు చెందిన ఉదయ్‌ కిరణ్‌ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట, జిల్లా అధ్యక్షులు రాజేందర్‌ రెడ్డి, క్రీడా సంఘాల్లో ప్రతినిధులు అభినందనలు తెలిపారు

ఆర్మూర్‌లో కత్తెరపోట్ల కలకలం

- వ్యాపార లావాదేవీల్లో గొడవలు
- ఇద్దరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలో కత్తెరపోట్ల కలకలం శనివారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో నలుగురు వ్యక్తులు ఇద్దరిపై కత్తెరలతో దాడి చేశారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అఖిల్‌, ఆసిఫ్‌, మోసిన్‌ ఆర్మూర్‌ పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో హెర్‌ కటింగ్‌ షాప్‌ నిర్వహిస్తున్నారు. వ్యాపార లావాదేవీల్లో వీరి మధ్య గొడవలు రావడంతో విడిపోవాలనుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి అఖిల్‌, ఆసిఫ్‌, మోసిన్‌ మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మోసిన్‌ కోపంతో మరో నలుగురు వ్యక్తులతో కలిసి అఖిల్‌, ఆసిఫ్‌పై సెలూన్‌లో ఉపయోగించే కత్తెరలతో దాడిచేసి పారిపోయారు. దీంతో స్థానికులు క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.